## పటిష్టంగా సమాచార హక్కు చట్టం వారోత్సవాలు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**మెదక్ టౌన్ అక్టోబరు 7 ప్రభాతవార్త,:**

సమాచార హక్కు (ఆర్ టి ఐ ) చట్టం, 2005, ప్రభుత్వ అధికారుల పనితీరులో పారదర్శకత , జవాబుదారీతనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఒక మైలురాయి చట్టం గా ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.సమాచార హక్కు చట్టం వారోత్సవాలపై కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమైన చట్టం అమలులోకి వచ్చినందుకు ప్రభుత్వం నుండి సమాచారం పొందే హక్కు గురించి పౌరులలో అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 5 నుండి 12 వరకు ఆర్టిఐ వారోత్సవాన్ని జరుగుతాయన్నారు. ఈ వారంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లు, రెవెన్యూ డివిజన్లు మరియు మండల ప్రధాన కార్యాలయాలలో అన్ని విభాగాలలో ఆర్.టి.ఐ దినోత్సవ వేడుకలు 2025 నిర్వహించాలని తెలిపారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## రామాయణం రచించిన గొప్ప వ్యక్తి వాల్మీకి

### మెదక్ జిల్లా ఎస్‌పి శ్రీనివాసరావు

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 6, ప్రభాతవార్త:** మహర్షి వాల్మీకి తన గురువు బోధనల ద్వారా ప్రేరణ పొంది, పశ్చాత్తాపంతో సద్గుణమార్గం వైపు మళ్లారని . ఆత్మశోధన ద్వారా మహానుభావుడిగా మారి, మనందరికీ ఆదర్శప్రాయమైన రామాయణం అనే గ్రంథాన్ని రచించిన గొప్ప వ్యక్తి మహర్షి వాల్మీకి అని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు. అన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మనసు మారితే ఎవరైనా మహానుభావులుగా ఎదగగలరని తెలిపారు. ఆయన చూపిన సత్యం, ధర్మం, నీతి మార్గాల్లో నడుచుకుంటూ సమాజానికి సేవ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు సుభాష్ చంద్ర బోస్, రంగనాయక్, సీఐలు మధుసూదన్ గౌడ్, సందీప్ రెడ్డి, ఆర్ఐలు రామకృష్ణ,శైలేందర్, ఏఓ మణి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

### ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం

## ఆర్‌ఓ, ఏఆర్‌ఓలకు శిక్షణ తరగతులు

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే స్టేజ్-1లో 176 ఆర్‌ఓ,176 ఏఆర్‌ఓలు, స్టేజ్-2లో 608 ఆర్‌ఓలకు రాండమైజేషన్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఆర్‌ఓ, ఏఆర్‌ఓలకు రాండమైజేషన్ చేశారు. ఎన్నికలకు సంబంధించి మాస్టర్ ట్రైనర్‌తో శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, జడ్పీ సీఈఓ రమేష్, డిపిఓ దేవకీదేవి, డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఈడిఎం అనంద్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రపంచం ఉన్నంతవరకు రామాయణం, వాల్మీకి చరిత్ర ఉంటుందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు.కలెక్టరేట్‌లో మంగళవారం బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వాల్మీకి మహర్షి జయంతి సందర్బంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇతిహాసాల్లో మొదటిది రామాయణం..పెద్దది మహాభారతం..అలాంటి రామాయణాన్ని రచించింది బోయ కులానికి చెందిన వాల్మీకి అన్నారు.వాల్మీకి ఇచ్చిన స్ఫూర్తితో అనేక మంది రచయితలుగా, కవులుగా మారారని తెలిపారు. వాల్మీకి లాంటి గొప్పవారి చరిత్రను తెలుసుకోవడం నేటితరానికి అవసరమన్నారు. కార్యక్రమంలో జడ్పి సీఈవో రమేష్, డిఆర్‌డిఏపిడి జయదేవ్ ఆర్య, బిసి సంక్షేమశాఖ అధికారి సయ్యద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

**సిపి కార్యాలయంలో...**

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి.హెచ్. కుశాల్కర్, వివిధ విభాలకు చెందిన సీఐలు శ్రీధర్‌గౌడ్, రామకృష్ణ, సిబ్బంది ఫయాజుద్దీన్,నిమ్మల అలీషా తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట మున్సిపల్‌లో నిధుల అవకతవకలపై విచారణ



మున్సిపల్ కార్యాలయంలో విచారణ చేస్తున్న రీజనల్ డైరెక్టర్

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 7, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని మున్సిపల్‌లో నిధుల అవకతవకలపై వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం మున్సిపల్‌శాఖ రీజనల్ డైరెక్టర్(ఆర్‌డి వరంగల్) షాహిద్ మసూద్ విచారణ చేపట్టారు. అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ మంజూరు,టెండర్ లేదా బాక్స్ టెండర్, కాంట్రాక్టర్ పేరు లేకుండా పని అనుమతులు కాంట్రాక్టర్‌కు ఇవ్వకుండా ఎంబి రికార్డు చేయకుండా మున్సిపల్ కమిషనర్ చాంబర్ రీన్నోవేషన్, బాక్స్ టెండర్ల పేరిట రూ.లక్షలోపు 140 చెక్కులు ఇష్టానుసారంగా విడుదల చేయడంతో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ కౌన్సిలర్ తనయుడు కమిషనర్ ఆఫ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే!. దీంతో మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రీజనల్ డైరెక్టర్ మున్సిపల్ కమిషనర్ సిద్ధి అశ్రితకుమార్‌తో పాటు ఫిర్యాదు దారుడు మణిదీప్‌రెడ్డిని విచారించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేయడం జరిగిందని నివేదికను మున్సిపల్ ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందని ఆర్‌డి షాహిద్ మసూద్ తెలిపారు.

## ప్రారంభమైన శబరిమలై మహాపాదయాత్ర

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబరు 7, ప్రభాతవార్త :** శబరిమలై మహాపాదయాత్ర సంగారెడ్డి పాత బస్టాండ్‌లోని నవరత్న ఆలయం నుండి శబరిమల శ్రీ అయ్యప్ప స్వామిని దర్శించుకోవడానికి మూడవసారి మహాపాదయాత్ర ప్రారంభమైంది. 30 మంది అయ్యప్ప స్వాములు చేపట్టిన ఈ యాత్ర సుమారు 1600 కిలోమీటర్లు శంకర్పల్లి మీదుగా తిరుపతి చేరుకొని వెంకటేశ్వరుని దర్శనం చేసుకుని కాణిపాకం సిద్ది వినాయకుని దర్శనం చేసుకుని,అరుణాచలం గిరి ప్రదర్శన చేసుకుని శబరిమల కొండకు పయనమవుతారని గురు స్వామి సాహితీ రాము తెలిపారు.ఈ పాదయాత్ర ప్రారంభానికి ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మహా పాదయాత్రలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

# రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు భారీ ఏర్పాట్లు

### మూడు రోజులపాటు క్రీడా సంబరాలు..క్రీడల నిర్వహణకు ప్రత్యేక కమిటీలు..ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తదితరులు

**పటాన్‌చెరు, అక్టోబరు 7, ప్రభాతవార్త**

పటాన్‌చెరు పట్టణంలోకి మైత్రి మైదానంలో ఈ నెల 16, 17, 18 తేదీలలో నిర్వహించనున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీ బాల్ క్రీడల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి స్పోర్ట్స్ క్లబ్ భవనంలో క్రీడల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను నిర్వహించేందుకు పటాన్ చెరు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా ఇందుకు సమ్మతించినట్లు ఆయన తెలిపారు. అండర్ 17 బాలుర వాలీబాల్, అండర్ 14 బాలురు, బాలికల కబడ్డీ పోటీలను అక్టోబర్ 16, 17, 18 తేదీల లో పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 420 మంది క్రీడాకారులతో పాటు 200 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది క్రీడలలో పాల్గొనబోతున్నారని తెలిపారు. వీరందరికి మూడు రోజులపాటు భోజనం, వసతి, బహుమతులు సొంత నిధులతో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లను సైతం సొంత నిధులతో జాతీయస్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గాన్ని రాష్ట్ర, జాతీయ క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. క్రీడల సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు, మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్ శాఖల అధికారులతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు పటాన్ చెరు కేంద్రంగా జరగబోతున్న స్కూల్ గేమ్స్ క్రీడలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.సమావేశంలో పటాన్‌చెరు డిఎస్‌పి ప్రభాకర్, సీఐ వినాయక్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, మండల విద్యాశాఖ అధికారులు పిపి రాథోడ్, నాగేశ్వరరావు నాయక్, ఎస్జిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, గౌసుద్దీన్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్

## పాత కక్షలతోనే యాదగిరి హత్య

### తూప్రాన్ డిఎస్‌పి నరేందర్‌గౌడ్

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబరు 7, ప్రభాతవార్త :** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం శాలిపేట గ్రామంలో పాత కక్షల కారణంగానే ఉప్పరి యాదగిరి హత్య జరిగినట్లు తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం రామాయంపేట పోలీస్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన హత్య వివరాలను వెల్లడించారు. శాలిపేట గ్రామానికి చెందిన ఉప్పరి శ్యాములు, ఉప్పరి రాములు, ఉప్పరి ఎల్లం ముగ్గురు అన్నదమ్ములు కలిసి అదే గ్రామానికి చెందిన ఉప్పరి యాదగిరిని బండరాయితో మోది హత్య చేశారు. మృతుడు యాదగిరి గతంలో గ్రామంలో దొంగతనాలు చేస్తూ ఉండేవాడు. అతడిపై పలు కేసులు నమోదయ్యాయని డీఎస్పీ తెలిపారు. గతంలో యాదగిరి, నిందితుడు శ్యాములు తమ్ముడు సిద్దరామును కట్టెతో కొట్టి చంపే ప్రయత్నం చేశాడని, అలాగే నిందితుడు రాములు తమ్ముడు లక్ష్మణ్‌ను గొర్రెల దొంగతనం కేసులో ఇరికించాడని, ఎల్లం భార్యను ఇబ్బంది పెట్టేవాడని విచారణలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో యాదగిరి వారిని తరచుగా బెదిరించడంతో ముగ్గురు నిందితులు ప్రతీకారం తీర్చుకునేందుకు పథకం రూపొందించినట్లు తెలిపారు. అక్టోబర్ 6న ఉదయం 10.30 గంటల సమయంలో ముగ్గురు నిందితులు కలిసి యాదగిరి ఇంటికి వెళ్లి, అక్కడే బండరాయితో దాడి చేసి చంపినట్లు డీఎస్పీ వివరించారు. అదేరోజు రాత్రి 7 గంటల సమయంలో గవ్వలపల్లి ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ముగ్గురూ నేరాన్ని ఒప్పుకున్నారని చెప్పారు. నిందితులు శ్యాములు, రాములు, ఎల్లంలను అరెస్టుచేసి న్యాయస్థానానికి హాజరుపరిచినట్లు రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ తెలిపారు.

## అనుమానాస్పదస్థితిలో విద్యార్థి మృతి

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 7, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం జిల్లెల్లగడ్డలోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వివేక్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం మంగళవారం కలకలం రేపింది. హాస్టల్ కారిడార్‌లో ఆడుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు మెడకు తాడు చుట్టుకొని విద్యార్థి వివేక్ మృతి చెందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మృతుడు నంగునూర్‌కు చెందిన విద్యార్థి కాగా సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు విచారణ చేపట్టారు. దసరా సెలవులు ముగియడంతో సోమవారం ఉదయం వివేక్‌ను తండ్రి సత్యనారాయణ హాస్టల్‌లో దించి వెళ్లారు. ఉదయం ఉపాధ్యాయులు ఫోన్ చేసి మీ అబ్బాయికి దెబ్బలు తాకాయని చెప్పి రమ్మన్నారని వచ్చి చూసేసరికి విషయం తెలిసిందని తండ్రి కన్నీరు మున్నీరుగా విలపించారు. 5వ తరగతి నుంచి వివేక్ ఇదే పాఠశాలలో చదువుతున్నారని తెలిపారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

**గుమ్మడిదల అక్టోబరు 7 ప్రభాతవార్త :** గుమ్మడిదల మండలం మంబాపూర్ గ్రామ సమీపంలోని, జాతీయ రహదారి 765డిపై జరిగిన ఆటో ఆగి ఉన్న లారీ కాంటైనార్ ట్రాలీ ని సెప్టెంబర్ 18న రాత్రి 7:30 ప్రాంతంలో వెనక నుండి ఢీకొట్టిన సంఘటనలో నల్లవల్లికి చెందిన, మహిళా తలారి ఇందిర(41) అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. మరో వ్యక్తి జిన్నారం మండలం అండూరు గ్రామానికి చెందిన వ్యక్తి (నల్లవల్లికి చుట్టం చూపుగా వచ్చిన) కాసాల యాదయ్య(52) తీవ్ర గాయాలు కాగా వెంటనే అంబులెన్సులో మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుండి గాంధీ హాస్పిటల్ తీసుకెళ్లారు. అక్కడ కొద్ది రోజులుగా చికిత్స పొందుతూ 6వ తేదీ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడు యాదయ్యకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. అదే ప్రమాదంలో గాయపడిన నల్లవల్లి గ్రామానికి చెందిన కురుమ మానెమ్మ గాయాల నుండి చికిత్స పూర్తి చేసుకుని ఇంటికి చేరుకుంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. గుమ్మడిదల ఎస్ఐ లక్ష్మీకాంత్‌రెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

## స్థానిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

### అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ అక్టోబరు 7, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా నిష్పక్షపాతంగా జరగడానికి ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికలు 2025 నేపథ్యంలో జిల్లాలో ఎంపిక చేసిన ఫ్లయింగ్ స్కాడ్ టీం సభ్యులకు , జోనల్ అధికారులు, స్టాటికల్ సర్వే లైన్స్ టీం సభ్యులు, సహాయ వ్యయ పరిశీలకులకు మాస్టర్ ట్రైనర్‌లతో అవగాహన, శిక్షణ కార్యక్రమం జిల్లా పరిషత్ సీఈవో జానకి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా నిస్పక్షపాతంగా నిర్వహించడానికి అధికారులు ప్రతి ఒక్కరు కృషిచేయాలి అన్నారు. ప్రతి ఒక్క అధికారి కేటాయించిన బాధ్యతలను విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. తమ ఎన్నికల విధుల పట్ల నిరక్ష్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో రెండు విడత లలో జరగనున్న ఎంపిటీసీ,జడ్పిటిసి ఎన్నికల వివరాలను అదనపు కలెక్టర్ అధికారులకు వివరించారు.మాస్టర్ ట్రైనర్‌లతో ఎన్నికల విధానం పర్యవేక్షణ చర్యలు రికార్డుల పరిశీలన వ్యయ పరిశీలన విధానం అధికారులకు సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, సర్వే లైన్స్ టీంలు తక్షణం విధుల్లోకి వచ్చి ప్రజల్లో ఎన్నికల పట్ల నమ్మకం కలిగించేలా పనిచేయాల న్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే క్షేత్రస్థాయిలోకి సంబంధిత టీంలు వెళ్లి వాస్తవా లను పరిశీలించి, ఏం సి సి కోడ్ నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ డి ఎస్ సి కార్పొరేషన్ అధికారి రామాచారి.రెవెన్యూ శాఖ అధికారులు , ఎన్నికల విభాగం అధికారులు ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

### సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్...

**సంగారెడ్డి, అక్టోబరు 7 ప్రభాతవార్త :** ఒక వ్యక్తి ఆవేశంలో చేసిన హత్యకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది జిల్లా న్యాయస్థానం అని సంగారెడ్డి జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్ తెలిపారు. ఎస్‌పి కథనం ప్రకారం... చౌటకూర్ గ్రామస్తుడైన పెద్ద గొల్ల బీరప్ప, తండ్రి కొమురయ్య సదాశివపేట మండలం తిమ్మన్నగూడెం నిజాంపూర్ వద్ద నివాసం ఉండి సదాశివపేటలో కూలి పని చేసేవాడు. కుటుంబ కలహాలతో భార్యను వదిలేసిన ఆయన ట్రాక్టర్ బ్యాటరీ దొంగతనం విషయంలో మృతుడు పాపయ్య మరికొందరు తనను తిట్టి అవమానించారని తనపై మూత్రం పోశారని మనసులో ఉంచుకున్న అతను పాపయ్యను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. ఆగస్టు 5, 2021వ తేదీ తెల్లవారజామున 3 గంటల సమయంలో లక్ష్మీ కాంప్లెక్స్ వద్ద నిద్రలో ఉన్న పాపయ్య తలపై పెద్దరాయితో బలంగా కొట్టి హత్య చేశాడు. ఈ విషయమై పాపయ్య కుమారుడు పెద్ద గొల్ల సుభాష్ తన తండ్రిని హత్య చేసిన బీరప్పపై అప్పటి ఎస్‌హెచ్‌ఓ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సంతోష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విన్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జి.భవానిచంద్ర నిందితుడికి యావజ్జీవ కారాగరశిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు జరిమానా చెల్లించినట్లయితే మూడు రోజులు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ, అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారి సంతోష్‌కుమార్ ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ రవీందర్ కోర్టు లైజనింగ్ అధికారి రాజశేఖర్, సత్యనారాయణ ఎస్పైలను ఎస్పి పరితోష్ పంకజ్ అభినందించారు.

## మాదిగలకు మంత్రి పొన్నం క్షమాపణ చెప్పాలి

### మాజీ సర్పంచ్ రమేష్

**అక్కన్నపేట, అక్టోబరు 7, ప్రభాతవార్త :** దళిత సామాజిక మాదిగ వర్గానికి చెందిన రాష్ట్ర సాంఘీకసంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పై అహంకార పూరిత మాటలతో కించపరిచిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వెంటనే క్షమాపణ చెప్పాలని చౌటపల్లి మాజీ సర్పంచ్ గద్దల రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఓట్లు సీట్ల కోసం దళిత జాతిని వినియోగించుకొని అదే సామాజిక మాదిగ వర్గానికి చెందిన మంత్రిని కించపరచడం దళిత ద్రోహ చర్యగా భావిస్తున్నామన్నారు. బీసీ వాదంతో ముందుకు వచ్చిన పొన్నం దళిత వర్గాలకు విలువ ఇవ్వకుండా అసలైన రజాకార వ్యవస్థను నడిపిస్తున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంత్రి పొన్నంకు తగిన బుద్ధి చెప్పడానికి దళిత మాదిగ వర్గాలు సిద్దంగా ఉన్నాయన్నారు. మంత్రి పొన్నం వెంటనే దళిత జాతి మాదిగ వర్గానికి క్షమాపణ చెప్పాలని లేదంటే నియోజకవర్గంలో ఉన్న మాదిగ సామాజిక వర్గాన్ని ఏకం చేసి హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో నిరసనలు వ్యక్తం చేస్తామని హెచ్చరించారు.

# సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

### -జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి

**గజ్వేల్, అక్టోబరు 7(ప్రభాతవార్త):** 42 శాతం రిజర్వేషన్ అంశంపై సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు.మంగళవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ 60 శాతానికిపైగా బలహీనవర్గాల జనాభా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం జాగృతి ఉద్యమించి బలహీన వర్గాల ప్రజల్లో కదలిక తెచ్చినట్లు గుర్తుచేశారు. ఈ క్రమంలో వారి నుండి సంపూర్ణ మద్దతు దక్కుతున్నట్లు తెలిపారు. అయితే సుప్రీంకోర్టు నిర్ణయంలో కాంగ్రెస్ తన వంతు పాత్ర పోషించగా, బిజెపి మాత్రం ద్వంద నీతి ప్రదర్శిస్తూ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. ముఖ్యంగా 42 శాతం రిజర్వేషన్‌పై బిజెపి పార్టీ చీఫ్ మాట్లాడిన తీరు సిగ్గుచేటుగా ఉందని, మద్దతు ఇస్తున్నట్లు ప్రకటిస్తూనే పార్లమెంటులో స్పందన లేకపోవడం, గవర్నర్ వద్ద బిల్లు పెండింగులో ఉండడం ద్వారా బిజెపి కుటిల యత్నాలు ప్రజలు గ్రహిస్తున్నట్లు చెప్పారు.

కాగా 42 శాతం రిజర్వేషన్‌పై ఈనెల 8వ తేదీన హైకోర్టులో విచారణ జరుగుతున్నందున కాంగ్రెస్ తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. అలాగే పేద ప్రజలపై భారం మోపకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన బస్సు చార్జీల నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం అన్ని పార్టీలు మద్దతు ప్రకటించాలని, లేనిపక్షంలో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని వివరించారు.

# హైకోర్టులో విచారణపై... నాయకుల్లో ఉత్కంఠ

* స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఉంటాయా? రద్దు చేస్తారా?
* అన్ని పార్టీల నేతల మదిలో కొత్త రిజర్వేషన్లు వద్దనే భావన
* రద్దయితే పాత రిజర్వేషన్లను కొనసాగిస్తారా..?




**టేక్మాల్, అక్టోబరు 7, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రిజర్వేషన్లను ఖరారు చేసినప్పటికీ కేడర్ నాయకుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తాము అనుకున్న రిజర్వేషన్లు రాక కొందరు నాయకులు బాధపడుతుండగా, తమకు అన్యాయం చేశారని చెబుతున్న గ్రామీణ నాయకులను సముదాయించలేని స్థితిలో నియోజకవర్గ నాయకులు ఉన్నారు. ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారుచేయడం, అప్పటికే సిద్ధంగా ఉన్న రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడం చకచకా జరిగిపోయాయి. జీఓ ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేయడం చెల్లదనే భావనతో కోర్టుకు వెళ్లగా, ఈ నెల 8న హైకోర్టులో విచారణ జరిగి ఏదో విషయం తేలుతుందని అంతా భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇస్తే.. ఇతర పార్టీలు ఆ ప్రకారమే కేటాయించే అవకాశం ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు ఉంటాయా? రద్దు చేస్తారా? అని అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఎలాగో వాయిదాపడే ఎన్నికలనే అభిప్రాయానికి వచ్చిన కొందరు ఇప్పటికే గ్రామాల్లో హడావుడి లేకుండా స్తబ్దుగా వ్యవహరిస్తున్నారు. టేక్మాల్‌లో మరి కొందరు ఎలాగో ఎన్నికలు వస్తాయని జోష్‌లో తిరుగుతున్నారు. కానీ గతంలో స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట ఉన్న ఉత్సాహం మాత్రం ఎవరిలోనూ కనిపించడం లేదు. ఆశించిన ఫలితాలు రాకపోవడంతో టేక్మాల్ మండలంలోని ప్రధాన పార్టీల నాయకుల్లో అసంతృప్తి తీవ్రంగా కనిపిస్తుంది. అనుకూలంగా రిజర్వేషన్లు వచ్చిన వారు ఇదే కొనసాగాలని ఆశిస్తుండగా, అనుకూలంగా రానివారు మాత్రం రిజర్వేషన్లు మారాలని, అవసరమైతే పాతవి కొనసాగించాలని కోరుకుంటున్నారు. రెండు విధాలా కసరత్తు ప్రస్తుతం రిజర్వేషన్ల అంశం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో షెడ్యూల్ విడుదల కావడంతో పాటు పనులు చకచకా జరిగిపోతున్నాయి. హైకోర్టు వెలు వరించే నిర్ణయం ఎలా ఉన్నా రెండు రకాలుగా ఎన్నికలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ నాయకులకు సూచనలు అందాయి. ఒకవేళ రిజర్వేషన్లు కొత్తవి కొనసాగితే ఖరారైన కేటగిరీల ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. దాదాపు మెజారిటీ గ్రామాల్లో కొత్త రిజర్వేషన్ల ప్రకారం ఎన్ని కలు జరిగితే కొత్త ముఖాలు తెరపైకి రానున్నాయి. ఒకవేళ కోర్టు జోక్యం చేసుకుని జీఓ ప్రకారం రిజ ర్వేషన్ల కేటాయింపు చెల్లదని, రాజ్యాంగం ప్రకారం 50 శాతం కంటే ఎక్కువ దాటొద్దని తీర్పు ఇస్తే మాత్రం ఇప్పటికే కాంగ్రెస్ ఎన్నికల్లో తమ పార్టీ బీసీ బీసీలకు 42 శాతం టికెట్లు ఇవ్వాలని నిర్ణయించింది. పాత రిజర్వేషన్లు కొనసాగినప్పటికీ జనరల్ స్థానాల్లో బీసీలకు టికెట్లు కేటాయిస్తారు. 42 శాతం కాకపోయినా దాదాపు 32 శాతం నుంచి 35 శాతం వరకు ఎంపీటీసీ, సర్పంచు స్థానాల్లో బీసీ అభ్యర్థులు గెలిచారు. అదే ఎంపీపీ, జడ్పీటీసీ వంటి పోస్టుల్లో అంతగా బీసీలకు ఇచ్చిన దాఖలాలు లేవు. ఈసారి అన్ని స్థానిక సంస్థల్లో ఇస్తారని చెబుతుండటంతో కొంత పరిస్థితి మెరుగు కావొచ్చు. అన్ని పార్టీలదీ అదే మంత్రం. గత ఎన్నికలను పరిశీలిస్తే ప్రధాన పోటీ బిఆర్ఎస్, కాంగ్రెస్ల మధ్యనే ఉన్నది. బిజెపి అంత ప్రభావం చూపించలేదు. అయితే ఈసారి కాంగ్రెస్, బిఆర్ఎస్‌తోపాటు బిజెపి స్థానిక ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల అంశం తెరపైకి రావడం, ఆర్డినెన్స్, చట్టానికి ఆమోదం లభించకపోవడంతో జీఓ ద్వారా ఖరారు చేయడం జరిగిపోయాయి. దాని చుట్టూ జరుగుతున్న రాజకీయాల నేపథ్యంలో కాంగ్రెస్ అవ సరమైతే పార్టీ పరంగానైనా బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తోంది.

ఒకవేళ కాంగ్రెస్ ఆ ప్రకారం చేస్తే బీఆర్ఎస్ అదే విధానాన్ని అనుసరించే అవకాశం మాత్రం కచ్చితంగా ఉంటుంది. ఒకవేళ అవి ఇవ్వకపోతే స్థానిక ఎన్నికల్లో బీసీ నినాదమే ఎజెండాగా కాంగ్రెస్ పార్టీ తాను ఇచ్చిన అవకాశాన్ని తమ అభ్యర్థుల విజయం కోసం అందిపుచ్చుకుంటుందని చెప్పొచ్చు. అలాగే బీసీలకు ప్రాధాన్యం పెరిగితే ఆయా సామాజిక వర్గాల్లో స్వతంత్ర అభ్య ర్థుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

# 9న డ్యూయల్ డిగ్రీ కోర్సుల ప్రవేశానికి కౌన్సిలింగ్

## -పిజెటిఎయూ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్

**అత్తాపూర్ అక్టోబరు7,ప్రభాతవార్త :**
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీలు సంయుక్తంగా అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ బిఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశం కోసం ఈనెల 9వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు వాక్ ఇన్ కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు పిజెటిఎయూ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. అదేరోజు అనగా అక్టోబర్ 9వ తేదీ (గురువారం) మధ్యాహ్నం రెండు గంటలకు ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ ప్రాయోజిత కోటా బిఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్, బిటెక్ (ఫుడ్ టెక్నాలజీ), బి.టెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), తీలీది (ఆనర్స్), కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో సీట్ల భర్తీకి వాక్ ఇన్ కౌన్సిలింగ్ జరగనుందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఈ రెండు కౌన్సిలింగ్ లు రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగ కేంద్రంలో నిర్వహించనున్నట్లు విద్యాసాగర్ వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, వెబ్ సైట్ లో పేర్కొన్న రుసుముతో కౌన్సిలింగ్ కు హాజరుకావాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ లో చూడవచ్చని రిజిస్ట్రార్ డాక్టర్ తెలిపారు.

### రాజాను పరామర్శించిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



రాజాను పరామర్శిస్తున్న బండారు దత్తాత్రేయ

**హైదరాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త:** బిజెపి సీనియర్ నాయకుడు అంబర్‌పేట దేవస్థాన్ సేవా సమితి ఉపాధ్యక్షులు రంగంపల్లి రాజాను హార్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. ఇటీవల రాజా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుకున్న దత్తాత్రేయ మంగళవారం ఆయన ఇంటికి వచ్చి ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన దత్తాత్రేయకు 'ప్రజల ఆత్మకథే నా ఆత్మకథ' అనే పుస్తకాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాజా కుటుంబ సభ్యులు దత్తాత్రేయను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్, సి.కృష్ణాగౌడ్, అచ్చని రమేష్, గోవర్ధన్‌రెడ్డి, చుక్క జగన్, ఆర్.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### బాచుపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిసిపి సురేష్ కుమార్



రికార్డును పరిశీలిస్తున్న దృశ్యం

**బాచుపల్లి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
బాచుపల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం బాలానగర్ జోన్ డిసిపి కే సురేష్ కుమార్ ఐపిఎస్ సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ ప్రాంగణం మొత్తం పరిశీలించారు. ప్రభుత్వ ఆస్తులు, నేర ఆస్తులు, స్టేషన్ రికార్డులు, వివిధ కేసుల ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పిటిషనర్లతో సంభాషించి వారి అభిప్రాయాలను స్వీకరించారు. అనంతరం ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను పరిశీలించి సిబ్బందితో సంభాషించారు. పోలీసుల సంక్షేమం, భత్యాలను సమీక్షి ంచారు. ఈ కార్యక్రమంలో ఏసిపి. రవికిరణ్ రెడ్డి, బాచుపల్లి ఎస్‌హెచ్ఓ సతీష్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్లు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# వేధింపులు,వివక్షల వంటి సమస్యలపై చైతన్యం కల్గి ఉండాలి

## -మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజ రమణ



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజ రమణ.

**బేగంపేట అక్టోబరు 7,ప్రభాతవార్త**
సమాజంలో మహిళలు,బాలికలు ఎదుర్కొంటున్న వివిధ సామాజిక దురాచారాలు,వేధింపులు,వివక్షలు వంటి సమస్యలపై చైతన్యం కలిగి ఉండాలని మహిళా కమీషన్ కార్యదర్శి పద్మజ రమణ అన్నారు.తెలంగాణా రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద ఆదేశానుసారం మహిళా కమీషన్ ఆధ్వర్యంలో సామాజిక దురాచారాలపై పోరాటం అనే అంశంపై గోల్కొండలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా కమీషన్ కార్యదర్శి పద్మజ రమణ మాట్లాడుతూ మహిళలు తమ హక్కులను తెల్సుకుని ధైర్యంగా ముందుకు రావాలని ,సామాజిక దురాచారాలు అయిన బాల్య వివాహాలు,వరకట్న వేధింపులు,బాలకార్మికులు,వాటిని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళా భద్రతా విభాగం, షీటీమ్ పోలీసులు గృహహింస,ఈవ్ టీజింగ్ మహిళలపై వేధింపుల వంటి సామాజిక సమస్యలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టపరమైన మార్గాల గురించి పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు,మహిళలు,బాలికలు,మహిళా భద్రతా విభాగం షీటీమ్ అధికారులు సీడీపీఓ రేణుక,ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ,మహిళా కమీషన్ అధికారులు పాల్గొన్నారు.

### సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి న్యాయవ్యవస్థపై దాడే



ప్రసంగిస్తున్న బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

**చిక్కడపల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త:** ఢిల్లీలోని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గావాయ్ పై దాడికి యత్నించిన రాకేష్ కిషోర్ అనే న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని బహుజన లెఫ్ట్ పార్టీ బిఎల్‌పి(బహుజన కమ్యూనిస్టు) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని బిఎల్‌పి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా నిర్మితమైన అత్యున్నత న్యాయవ్యవస్థపై దాడి చేయడమంటే భారత రాజ్యాంగంపై ప్రజాస్వామ్యంపై ఫాసిస్టు దాడిగా భావించాలని బహుజన లెఫ్ట్ పార్టీబిఎల్ పి(బహుజన కమ్యూనిస్టు) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ తెలిపారు. జస్టిస్ బి.ఆర్.గావాయ్ పై జరిగిన దాడికి వందలాది మంది న్యాయవాదులే సాక్షంగా భావించి దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్ న్యాయవాద పట్టాను వెంటనే రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# దేశాభివృద్ధికి శాశ్వత పరిష్కారం విద్యార్థిని, విద్యార్థులే

**హ్యూమన్ రైట్స్ పిడబ్ల్యుఎఓ వ్యవస్థాపకుడు మాధవాచారి**



సుగుణారెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న గోట్టిముక్కల మాధవాచారి

**సైఫాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త:**
దేశాభివృద్ధికి శాశ్వత పరిష్కారం విద్యార్థిని, విద్యార్థులేనని తరగతి గదియే దేశ భవిష్యత్తు, దేశంలో అటెండర్ స్థాయి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి వరకు తరగతి గది నుంచి వచ్చినవారేనని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్ట్ అండ్ వెల్ఫేర్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొట్టిముక్కల మాధవాచారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్గనైజేషన్‌కు రాష్ట్ర సభ్యురాలిగా, మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షురాలిగా అమ్మనగంటి సుగుణారెడ్డిని నియమించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థినీ, విద్యార్థులలో నీతి, నిజాయితీ, ధర్మం, మానవత్వం, సంస్కారం, దయ, జాలి, కరుణ, ప్రేమ, స్త్రీల పట్ల గౌరవం, మానవత్వంతో కూడిన విద్యను అవలంభన చేసుకోవాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులను మొదటి దైవంగా, గురువులను రెండో దైవంగా, ఆ తరువాతనే భగవంతుని స్థానమని ఆయన తెలిపారు. దేశంలో నేడు నైతిక విలువలకు, మానవత్వానికి తావు లేకుండా పోయిందని, ప్రతి మనిషి వారి, వారి స్థాయికి తగ్గట్టుగా హక్కులపై అవగాహన కలిగియుండాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అర్గనైజేషన్ కోశాధికారి బైరి మాధవి, తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం వైస్-ప్రెసిడెంట్ ఎర్ర బాను, నాయకులు ప్రేమలత, హరిప్రసాద్, మురళి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జివో నెంబరు 9ని కాపాడుకోవడానికి కోర్టులో ఇంప్లిడ్ అవుతున్నాం

**బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ**



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

**సైఫాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త:** బిసిలకు కేటాయించిన 42 శాతం రిజర్వేషన్‌ల పరిరక్షణ కోసం జివో నెంబరు 9ని కాపాడుకోవడానికి సంబంధించిన పిటిషన్లలో తాము కూడా ఇంప్లిడ్ అవుతున్నామని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ చెప్పారు. రాష్ట్ర గవర్నర్ ప్రొసిజర్, మెరిట్‌పై వచ్చిన అంశంపై గత నెల 30వ తేదీలోగా ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం జివో ఇచ్చామనే వాదనను తాము పూర్తిగా సమర్థిస్తున్నామని ఆయన తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ మెరిట్ అంశంలో తాను బిసి రిజర్వేషన్‌ల పెంపు సాధనకై వేసిన ఫిటిషన్ ద్వారా వచ్చిన తీర్పు ఆధారంగా జరిగిన కుల గణన, అదే విధంగా మరో తీర్పు ద్వారా వచ్చిన ఎంటోడేడ్ కమిషన్ నియామక ప్రక్రియ ద్వారా వచ్చిన రిజర్వేషన్ల పెంపుకు అనుగుణ నివేదిక తద్వారా వచ్చిన జివో నెంబర్‌గా పరిగణించాలనే వాదనకు అవసరమైన న్యాయ పూర్తి ప్రక్రియ చేయమని కోరామని తెలిపారు. బిసిల రిజర్వేషన్‌లలో రాజకీయ పార్టీలు అవలంబిస్తున్న ద్వంధ వైఖరిలను ఎండగడతామని, ఒక పార్టీ కేంద్ర విధానాలకు మాత్రమే కట్టుబడి ఉంటామని షెడ్యూల్ 9లో చేర్చే ప్రక్రియకు మద్దతు ఇవ్వకుండా కేంద్ర హోం శాఖ ద్వారా రాజ్యాంగ వ్యవస్థలను ప్రభావితం చేస్తున్న అంశాన్ని మరో పార్టీ రిజర్వేషన్లకు వ్యతిరేక పిటిషన్లను వేయిస్తున్న విషయాన్ని ప్రభుత్వ చిత్తశుద్ధి లోపంపై సమగ్ర అవగాహనను బహుజన లోకానికి తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రత్యేక రైలులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న విఘ్నేష్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:**
ప్రత్యేక రైలులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల యాత్ర ఈ నవంబర్లో ప్రారంభించనున్నామని భారతీయ రైల్వేస్ భారత్ గౌరవ ట్రైన్, సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విఘ్నేష్ తెలిపారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేక పర్యాటక రైలులో తమిళనాడు, కేరళలో ఉన్న దేవాలయాలు, పంచ ద్వారక, మహదేవ్, జ్యోతిర్లింగాలు దర్శించుకునే అవకాశం కలదన్నారు. ఈ యాత్రలో ఒక యాత్ర నవంబర్ 16వ తేదీన, ఇంకో యాత్ర 26వ తేదీన ప్రారంభం కానుందన్నారు. ఇండియన్ రైల్వే, మొదటి భారత్ గౌరవ్ రైలు, సౌత్ స్టార్ రైల్, అతిపెద్ద టూరిస్ట్ రైలు ఆపరేటర్ టూర్ టైమ్స్ ఈ యాత్ర చేపట్టిందన్నారు. ఈ ప్రత్యేక పర్యాటక రైలు ఐఆర్సీటీసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో లేదన్నారు. రిజర్వేషన్ల కోసం టూర్ టైమ్స్‌ను నేరుగా 93550 21516 నెంబర్లో సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకోవచ్చన్నారు. తమిళనాడు, కేరళ దేవాలయాల యాత్ర నవంబర్ 16వ తేదీన ప్రారంభం అవుతుందన్నారు. ఈ యాత్రలో తిరుకడైయూర్, చిదంబరం, అరుణాచలం, తిరుచ్చి, తంజావూరు, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, తిరువనంతపురం, చొట్టనిక్కర, గురువాయూర్ కలవన్నారు. ప్రదోషం నాడు చిదంబర నటరాజుని దర్శనం, మాస శివరాత్రి నాడు అరుణాచల శివుని దర్శనం, అమావాస్య నాడు కావేరి నది ఒడ్డున పిండ తర్పణం చేసుకోవచ్చన్నారు. పంచ ద్వారక, మహదేవ్, జ్యోతిర్లింగాల యాత్ర నవంబర్ 26వ తేదీన ప్రారంభం కానుందన్నారు. ఈ యాత్రలో పంచ ద్వారకతో పాటు నిష్కళంక మహదేవ్, జ్యోతిర్లింగాల దర్శనం ఉంటుందన్నారు. ఇందులో ద్వారక, డాకోర్ ద్వారక, నాథ్ ద్వారక, కంక్రోలి ద్వారక, బేట్ ద్వారక, సోమనాథ్, నాగేశ్వర్, సోమనాథ్, నాగేశ్వర్, నిష్కలంక మహదేవాలయంతో పాటు యాదగిరి, స్టాట్యూ ఆఫ్ ఈక్విటీ, స్టాట్యూ ఆఫ్ యూనిటీ ఉంటాయన్నారు.

# ఆర్మీ అధికారుల అనుమతి తీసుకోవాలని కమిషనర్‌కు వినతి



రోడ్డును చదును చేసేందుకు ఆర్మీ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు.

**నార్సింగి, అక్టోబర్ 7 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని బైరాగిగూడ నుంచి నార్సింగి వైపుకు వెళ్లే రోడ్డును చదును చేసేందుకు ఆర్మీ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని కోరుతూ కమీషనర్ శరత్ చంద్రకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, సీనియర్ నాయకులు డప్పు నవీన్, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డంతో కిలో మీటర్ దూరం గుంతలమయమైందని, దీని వలన రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నరకాయతన పడుతున్నారని తెలిపారు. నిత్యం ఈ రోడ్డుపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, వాహనదారుల ఇబ్బందులను తొలగించేందుకు జేసీబీతో అక్కడికి తాము వెళితే ఆర్మీ జవాన్లు అభ్యంతరం తెలిపారన్నారు. మా పై అధికారుల నుంచి అనుమతి తీసుకొని రోడ్డును చదును చేసుకోవాలని సూచించారని వివరించారు. కార్పోరేషన్ కమీషనర్ హోదాలో ఆర్మీ అధికారులకు లెటర్ రాసి రోడ్డు చదును కోసం అనుమతి పొందాలని కమీషనర్‌ను కోరామన్నారు. ఇందుకు కమీషనర్ శరత్‌చంద్ర స్పందిస్తూ ఆర్మీ అధికారులకు లేఖ రాసి, అనుమతి తీసుకుంటామని హామీనిచ్చారు.

### గంజాయిని రవాణా చేస్తూ విక్రయించే నిందితుల అరెస్టు

**సరూర్‌నగర్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** ఒరిస్సా నుండి గంజాయిని హైదరాబాద్ నగరానికి రవాణా చేస్తూ విక్రయించే ఇద్దరు నిందితులను బాలాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. గంజాయిని సరఫరా చేసే ఒరిస్సాకు చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పట్టుబడిన ఇద్దరు నిందితుల నుండి రూ.లక్ష విలువ చేసే నాలుగు కిలోల ఎండు గంజాయిని అదే విధంగా రవాణాకు ఉపయోగించిన స్కూటర్‌ను స్వాధీనం చేసుకొని పోలీసులు కేసును నమోదు చేశారు. ఇన్స్‌పెక్టర్ సుధాకర్ తెలిపిన ప్రకారం ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రోషన్‌దౌలాకు చెందిన లేబర్ పని చేసే బిసా కొమురి అలియాస్ చింటు (19), కోకిలిగడ్డ ఆహరుణ్ అలియాస్ అరుణ్ (20)లు తేలికగా డబ్బు సంపాదించడానికి ఒరిస్సా నుండి అక్రమంగా గంజాయిని రవాణా చేస్తూ అవసరమైన వారికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటుంటారు. అయితే మంగళవారం బాలాపూర్ శివాజీ చౌక్ వద్ద బాలాపూర్ ఎస్ఐ ఎస్.కోటేశ్వర్‌రావు సిబ్బందితో కలిసి తనిఖీలు చే స్తుండగా అనుమానాస్పద స్థితిలో కొమురి, అరుణ్‌లు పట్టుబడ్డారు. ఈ మేరకు పోలీసులు జరిపిన విచారణలో వారు గంజాయిని ఒరిస్సా నుండి ద్విచక్ర వాహనంపై నగ రానికి తరలిస్తూ అవసరమైన వారికి విక్రయించే వారని తేలింది. ఈ నేపథ్యంలో నిందితుల నుండి గంజాయిని, ద్విచక్ర వాహనాన్ని (నెంబర్ హోండా డియో టిఎస్ 07 కెడి 8147) స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులతో పాటు పరారీలో ఉన్న ఒరిస్సా రాష్ట్రం కలిమెల జిల్లా నాగలూర్ గ్రామానికి చెందిన అర్జున్‌పై కూడా కేసును నమోదు చేశారు.

### అదరగొట్టిన కోల్‌కతా.. కొచ్చిపై ఘన విజయం

**హైదరాబాద్, అక్టోబర్ 6,ప్రభాతవార్త:**
ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్ లో కోల్‌కతా థండర్‌బోల్ట్స్ అదిరిపోయే ప్రదర్శనతో బోణీ కొట్టింది. మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో థండర్ బోల్ట్స్ 31 ( 1215, 1512, 156, 1917) తేడాతో కొచ్చి బ్లూ స్పైకర్స్‌పై అద్భుత విజయం సాధించింది. కోల్‌కతా విజయంలో కీలక పాత్ర పోషించిన పంకజ్ శర్మ ఖ్‌ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌ఖిగా నిలిచాడు.గత మ్యాచ్‌లో గెలిచిన ఉత్సాహంతో బరిలోకి దిగిన కొచ్చి బ్లూ స్పైకర్స్, హేమంత్ పవర్‌ఫుల్ సర్వీసులతో మ్యాచ్‌ను దూకుడుగా ప్రారంభించింది. ఇరు జట్ల డిఫెన్స్ పటిష్టంగా ఉండటంతో పాయింట్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. కొచ్చి సెట్టర్ బైరాన్ కెటుకారిస్ తెలివైన పాస్‌లతో కోల్‌కతాను ఒత్తిడిలోకి నెట్టి తొలి సెట్‌ను తమ జట్టుకు అందించాడు. అయితే రెండో సెట్ నుంచి కోల్‌కతా అసలు ఆట మొదలుపెట్టింది. కెప్టెన్ అశ్వల్ రాయ్, పంకజ్ శర్మ పదునైన దాడులతో కొచ్చి కోర్టులో అలజడి సృష్టించారు. మరోవైపు, అభిషేక్ సూపర్ సర్వ్‌తో ఆకట్టుకున్నా, కొచ్చి జట్టు చేసిన అనవసర తప్పిదాలు వారికి ప్రతికూలంగా మారాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కోల్‌కతా రెండో సెట్‌ను గెలిచి మ్యాచ్‌ను సమం చేసింది. మూడో సెట్‌లో కోల్‌కతా పూర్తి ఆధిపత్యం చెలాయించింది. మిడిల్ జోన్‌లో మాటిన్ తకవర్ అద్భుతంగా రాణించడంతో కొచ్చి జట్టు తేలిపోయింది. ఈ సెట్‌ను కోల్‌కతా 156తో సునాయాసంగా కైవసం చేసుకుంది. ఇక నాలుగో సెట్ నువ్వానేనా అన్నట్టు సాగింది. విజయం కోసం కొచ్చి చివరి వరకు పోరాడినప్పటికీ, కీలక సమయంలో మాటిన్ అద్భుతమైన బ్లాక్‌తో కోల్‌కతాకు 1917తో సెట్‌తో పాటు మ్యాచ్‌ను కూడా అందించాడు. ఈ సీజన్‌లో కోల్‌కతాకు ఇదే తొలి విజయం.

### బధిరుల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**చిక్కడపల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో బధిరుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ అధినేత వల్లభనేని ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వి. భారతీ, ఉపాధ్యక్షుడు కె. వెంకటేష్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బధిరుల విద్య, ఉపాధి, సంక్షేమ రంగాల్లో అనేక సమస్యలు కొన సాగుతున్నాయని తెలిపారు. మలకపేటలోని ప్రభుత్వ బధిరుల స్కూల్ ఆవరణలో ప్రభుత్వ హాస్టల్లో జూని యర్ ఇంటర్ నుంచి డిగ్రీ వరకు కాలేజీ ఏర్పాటు చేసి వసతులు కల్పించాలన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో సైగల భాష ద్వారా ప్రత్యేక మూగ బధిరుల స్కూల్ హాస్ట ల్ వసతులు కల్పించాలని కోరారు ప్రతి జిల్లాలో బధిర విద్యార్థుల కోసం 25 శాతం రిజర్వేషన్ కల్పించాల న్నారు. బధిరుల కోసం ప్రత్యేకంగా ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. బధిర విద్యార్థుల ఉన్నత విద్య కోసం ప్రభుత్వ పథకాలు, స్కాల ర్షిప్లు అమలు చేయాలన్నారు. బధిరుల కోసం ట్రెనింగ్ సెంటర్లు, ఎంప్లాయ్మెంట్ అవకాశాలు కల్పించాలి. నాలుగు శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయా లన్నారు. బధిరుల సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.

# నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## -ఎమ్మెల్యే చొరవతో రూ.10 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం



**అత్తాపూర్ అక్టోబరు7,ప్రభాతవార్త :**
నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పన కోసం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేసిన కృషి ఫలించింది. రాజేంద్రనగర్ సర్కిల్11 పరిధిలోని డివిజన్లలో అత్యవసరంగా నిర్మించాల్సిన సీసీ రోడ్ల పనుల మంజూరుకై ఎమ్మెల్యే ఇటీవల చార్మినార్ జోనల్ కమిషనర్ ని కలిసి విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభ్యర్థన మేరకు మైలార్‌దేవపల్లి (వార్డు59) మరియు రాజేంద్రనగర్ (వార్డు61) డివిజన్లతో సహా పలు ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి పనుల కోసం జీహెచ్ఎంసీ అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ జారీ చేసింది. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ....నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి,రాజేంద్రనగర్,అత్తాపూర్ డివిజన్‌లలో అభివృద్ధి పనులు మైనర్ రోడ్ల ,అప్‌గ్రేడేష్ కింద సిసి రోడ్ల నిర్మాణానికి 10 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో రోడ్ల దుస్థితి ఒకటి అన్ని ముఖ్యంగా వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సిసి రోడ్లు అత్యవసరం అన్నారు.తన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని 10 కోట్ల రూపాయల పనులకు త్వరగా అమోదం తెలిపిన చార్మినార్ జోనల్ కమిషనర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ నిధులతో రోడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ అభివృద్ధి పనులు టెండర్ ప్రక్రియ ప్రారంభించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని అధికారులకు ఆదేశించారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి : ఆకుల సతీష్



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఆకుల సతీష్

**దుండిగల్, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
సర్వే నెంబర్ 170/3,4 మల్లంపేట జిఎల్ఎస్ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ నందు మళ్ళీ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమి ఎఫ్టిఎల్ బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఆకుల సతీష్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ చేపట్టిన జిఎల్ఎస్ కాలనీ నందు రోడ్డు నెంబర్ 11 టూ 10 మధ్యలో దాదాపు ఎకరం స్థలం నందు సర్వే నెంబర్ 170/3,170/4 సంబంధించిన ప్రభుత్వ భూమిలో టిఎస్ బి పాస్ ఇన్సంట్ ఒక అనుమతితో ఆరు విల్లాస్ నిర్మాణలు గత నెల రోజులుగా జరుగుతున్నాయన్నారు. 3విల్లాల నిర్మాణానికి టీఎస్ బి పాస్ ఇన్సంట్ ద్వారా అనుమతులు పొందడం, మళ్ళీ ఏమైందో తెలియదు మున్సిపల్ అధికారులు వాటిని రద్దు చేయడం జరిగిందన్నారు. శ్రీ వినాయక రియాల్టర్స్ డెవలపర్స్ పేరుతో అనుమతులు పొంది నిర్మాణం ఏ విధంగా చేస్తున్నారో సంబధిత అధికారులు సమాధానం చెప్పాలన్నారు. సర్వే నెంబర్ 170/3, సర్వేనెంబర్ 170/4 నందు ప్రభుత్వ భూమి కలదని, గతంలో ఇదేవిధంగా సరైన అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమి చెరువులో చేపట్టిన నిర్మాణాలను కొనుగోలు చేసిన ప్రజలు పడిన ఇబ్బందులు చూసిన అధికారులు ఒకే ఒక తప్పుడు అనుమతితో ఆరు విల్లాల నిర్మాణం జరుగుతున్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తక్షణమే అనుమతుల్లేని ప్రభుత్వ భూమి, కత్వ చెరువు బఫర్ జోన్ నందు నిర్మాణాలు చేస్తున్న శ్రీ వినాయక రియాల్టర్స్ డెవలపర్స్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయడమే కాకుండా, ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాల చేసిన శ్రీ వినాయక రియాల్టర్స్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చందు, పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### రౌడీలకు కౌన్సిలింగ్ చేసిన ఏసిపి సుదర్శన్



రౌడీలకు కౌన్సిలింగ్ చేస్తున్న ఏసిపి సుదర్శన్, ఈచిత్రంలో సిఐ శ్రీనివాసులు

**గోషామహల్,అక్టోబర్ 7ప్రభాతవార్త:**
గోషామహల్ డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంటుందని గోషామహల్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు ఎస్.సుదర్శన్ పేర్కొన్నారు. గోషామహల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరికలు జారీ చేశారు.ప్రజలను వేదిస్తే కఠిన చర్యలు తప్పవని,అసాంఘిక కార్యకలాపాలు చేపడితే జైల్‌కు వెళ్తారని హెచ్చరించారు.సత్‌ప్రవర్తనతో మెలుగాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు,ఎస్ఐలు లక్ష్మయ్య, రాజు,అరుణోదయ,అరవింద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒకరు మొక్కలు నాటాలి : అర్పిత



మొక్కలను అందచేస్తున్న దృశ్యం

**బేగంబజార్,అక్టోబర్ 7ప్రభాతవార్త:**
పర్యావరణాన్ని పరిరక్షణ,పచ్చదనం మరింత వ్యాప్తి చేసే దిశగా ఖాళీ స్థలం కనిపిస్తే మొక్కలను నాటాలని రాష్ట్ర బిజెపి ఎండోమెంట్ సెల్ నాయకురాలు అర్పిత కోరారు. పర్యావరణానికి కలుగుతున్న కీడును నియంత్రణకు విధంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సి భాధ్యత ప్రతి ఒకరిపై ఉందన్నారు.ఈమేరకు తెలంగాణ బ్రహ్మణ సంస్థల సాంఘీకసేవలు,సురక్షిత సేవా చారిటబుల్‌ట్రస్ట్ పక్షాన వసంత విహార్‌లో హరిత హారంలో భాగంగా సుమారు 200మందికి మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేదిశగా, కాలుష్యాన్ని పారదోలేందుకు ఖాళీ స్థలాలు,ఇళ్ల అవరణలో తప్పని సరిగా మొక్కలు పెంచాలన్నారు.పర్యావరణం,మొక్కల పెంపకం గురించి ప్రజల్లో అవగాహన పెంచే దిశగా ఈ కార్యక్రమంలో ముఖ్యోద్దేశమన్నారు.ముందు కూడా ఈ తరహా కార్యక్రమాన్ని నగరంలో పలు చోట్లనిర్వహించి పర్యావరణాన్ని కాపాడుతామన్నారు.కార్యక్రమంలో డి. శ్రీనివాస్, మల్లాది పవన్,వైష్ణవ్ ప్రసాద్,బసవ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### మచిలీ కమాన్‌కు పెచ్చులూడి ఓ వ్యక్తికి గాయలు

**చార్మినార్,అక్టోబరు 7 ప్రభాతవార్త :** పాతబస్తీ గుల్జారాహౌస్‌లోని దాదాపు నాలుగు వందల సంవత్సరాల పురాతనమైన మచిలీ కమాన్ నుంచి మంగళవారం పెచ్చులూడి పోయాయి.అదే సమయంలో ఓ పాదచారి మీద పెచ్చులు పడటంతో స్వల్ప గాయాలు అయ్యాయి.ఈ సంఘటనలో ఎటువంటి ఆస్తినష్టం,ప్రాణనష్టం జరగలేదు.విషయం తెలుసుకున్న చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, ఘాన్సీ బజార్ డివిజన్ ఎంఐఎం ఇంఛార్జి సాహిల్ అక్బర్ పెచ్చులూడి పోయిన మచిలీ కమాన్‌ను సందర్శించారు.



జుబ్లీహిల్స్ లో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

# రోడ్డు భద్రత అందరి బాధ్యత

## - టిపిసిసి అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డి



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్లను పంపిణీ చేస్తున్న టీపీసీసీ నేతలు సామ రామ్మోహన్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, పోలీస్ అధికారులు

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 7 ప్రభాతవార్త**
రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యతని, ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటించటం విధిగా తీసుకోవాలని టీపీసీసీ మీడియా,కమ్యూనికేషన్ ్స చైర్మన్, కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డి అన్నారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గం మల్కం చెరువువద్ద శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.దిచక్రవాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేపట్టారు. టీపీసీసీ మీడియా,కమ్యూనికేషన్ ్స చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి,టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్,రంగారెడ్డిజిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్‌గౌడ్,రోహిత్‌గౌడ్, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ, మాదాపూర్ ఏసీపీ,పోలీస్ అధికారులు హజరై యువతకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాణ భద్రత కోసం వాహనదారులు హెల్మెట్ ధరించటం ఎంత ముఖ్యమో వివరించారు. ప్రజలందరూ ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలని, రోడ్డుభద్రత చర్యలు ప్రాణాలను కాపాడటమే కాకుండా సామాజిక క్రమశిక్షణకు ప్రతీకని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు భరత్‌గౌడ్, డీసీసీ శెక్రటరీ సురేశ్ గౌడ్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులంతా విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

## - ట్రాఫిక్ ఎసిపి చంద్రశేఖర్‌రెడ్డి



నార్సింగిలోని కేఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించిన ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి.

**నార్సింగి, అక్టోబర్ 7 ప్రభాతవార్త** : వాహనదారులంతా విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మాదాపూర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నార్సింగిలోని కేఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అనుమతి మేరకు వాహనాలలో ప్రయాణీకులను ఎక్కించుకోవాలని, డబ్బుల కోసం ఎక్కువ జనాభాను ఎక్కించుకుంటే పెద్ద మొత్తంలో చలానాలు వేయడం జరుగుతుందన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులనఉ గాని, సరుకులను గాని తీసుకెళ్లడం నేరమని సూచించారు. ఆటో డ్రైవర్లు ఎక్కడ పడితే ఆటోలను నిలిపి ట్రాఫిక్ సమస్యకు కారణం కాకూడదని, రోడ్లకు ఎడుమవైపుకు వెళ్లి నిలుపుకోవాలని తెలిపారు. వాహనాలను నడిపే వారు తప్పకుండా లైసెన్సు, ఆర్.సి, ఇన్సూరెన్స్‌లను వెంట పెట్టుకెళ్లాలని, ట్రాఫిక్ పోలీసులు అడిగినప్పుడు చూపించాలని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు యూనిఫాంను ధరించాలని, రాంగ్‌రూట్లో వాహనాలు నడిపినా, పార్కింగ్ చేసినా భారీ జరిమానాలు వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.ఆంజనేయులు, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్,ఎస్.ఐ రాజేష్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం

## కార్మికులకు అన్యాయం జరిగితే ఆందోళన చేస్తాం

**బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం**

**సిద్దిపేట రూరల్, అక్టోబరు 7, ప్రభాతవార్త :** కార్మిక వెల్ఫేర్ బోర్డులో సెస్ రూపకంగా వస్తున్న వేల కోట్ల రూపాయాలు ఎలా దుర్వినియోగం అవుతున్నాయని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం(బిఎన్ఆర్‌కెఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ప్రశ్నించారు. భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం మంగళవారం ఎస్‌రావు లైబ్రెరీ హాల్‌లో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రూ.360 కోట్లు ప్రైవేటు బీమా కంపెనీలకు అప్పజెప్పడం ఒక్క రోజులో చైర్మన్ నియమించి తిరిగి వెంటనే తీసివేయడం జరిగిందన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. త్వరలోనే వేలాది మంది కార్మికులతో కలిసి హైదారాబాద్‌లోని కార్మిక భవన్‌కు తరలివెళ్తామన్నారు. కార్యక్రమంలో బిఎన్ఆర్‌కెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెలిమెల రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి గంగాధర్, నాయకులు నాయిని రామస్వామి, తుడి అంజయ్య, తాండ్ర రాములు, వివిధ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో సౌకర్యాలు కల్పించాలి




మాట్లాడుతున్న యుఎస్ఎఫ్ఐ నాయకులు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 7, ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని యూఎస్ఎఫ్ఐ (యూనైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు కనీస వసతి సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు విడుదల చేయాలని, ప్రభుత్వ కళాశాలలో సైతం మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించాలన్నారు. గురుకుల ఉపాధ్యాయులకు జీతాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## యుబిఐలో దళారుల ఆగడాలకు కళ్లెం వేయాలి

**బిసివైపి రాష్ట్ర నాయకులు చక్రధర్‌గౌడ్**




యుబిఐ ఆర్ఎంకు ఫిర్యాదు చేస్తున్న చక్రధర్‌గౌడ్ తదితరులు

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 7, ప్రభాతవార్త :** చిన్నకోడూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యుబిఐ)లో దళారులే రాజ్యమేలుతున్నారని వారి అగడాలకు కళ్లెం వేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయంలో రీజినల్ మేనేజర్ శ్రీనివాస్‌కు రైతులతో కలిసి భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర నాయకులు గాదగోని చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు, రైతులకు సేవలు అందించాల్సిన బ్యాంక్ సిబ్బంది దళారుల కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. బ్యాంక్‌లో పంట రుణాల కోసం అధికారులు, సిబ్బంది దళారులతో కలిసి 5 వేల మంది ఖాతాదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. చిన్నకోడూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులుపై విచారణ చేపట్టి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని లేనియెడల రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీవై నాయకులు రాజంపేట రంజిత్, నర్సింహ్మారెడ్డి, తిరుపతిగౌడ్, సాయిరాం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నా భూమి నాకే చెందాలి..

**అన్నపై చెల్లెలు వాల్‌పోస్టర్, కరపత్రాలు పంపిణీ**

**విఠలాపూర్‌లో వినూత్న నిరసన**

**చిన్నకోడూరు, అక్టోబరు 7, ప్రభాతవార్త :**




ఇంటి గోడకు అతికించిన కరపత్రం

తన తండ్రి నుంచి ఆస్తిగా వచ్చిన 3.3 గుంటల భూమి తనకు రావాల్సిన ఉండగా తనకు రాలేదని మండల పరిధిలోని విఠలాపూర్ గ్రామానికి చెందిన పుచ్చకాయల కనకవ్వ వినూత్న నిరసన చేపట్టింది. తన స్వంత అన్న పుచ్చకాయల ఓజిరెడ్డి తనకు తండ్రి నుంచి రావాల్సి భూమిని కబ్జా చేశారంటూ కనకవ్వ ఆవేదన వ్యక్తం చేస్తుంది. తన అన్న తనకు తండ్రి నుంచి రావాల్సిన భూమి ఇవ్వకుండా కబ్జా చేశారంటూ గ్రామంలో ఇంటింటికి కరపత్రం గోడకు అతికించి నిరసన వ్యక్తం చేసింది. తనకు రావాల్సిన భూమి తనకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వమంటే బెదిరింపులకు గురి చేస్తున్నారని కనకవ్వ వాపోయారు. గ్రామస్తులు తనకు న్యాయం చేయాలని కోరుతూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసింది.

## ఆల్విన్ కాలనీలో వాల్మీకి జయంతి

**కూకట్‌పల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ జన్మభూమి కాలనీలో నాయకులు బోయకిషన్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పిఏసి చైర్మన్ పరికెపూడి గాంధీ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, రఘునాథ్‌రెడ్డితోకలిసి వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చైర్మన్ గాంధీ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి గొప్ప వ్యక్తి అని, సంస్కృత సాహిత్యంలో పేరెన్నికగల కవి అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పాల్గొన్నారు.

# బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

**-టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు**

**గజ్వేల్, అక్టోబరు 7 (ప్రభాతవార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణానికి చెందిన మాజీ ఎంపిటిసి పంజాల ప్రశాంతి రాజుగౌడ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బండారు శ్రీకాంత్ రావు మాట్లాడుతూ మాజీ ఎంపిటిసి పంజాల ప్రశాంతి రాజుగౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఎన్నడూ బడుగు, బలహీన వర్గాలను పట్టించుకోలేదని నేడు ఇళ్లులేని నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే అన్నారు. హర్ గర్ వాపస్‌లో భాగంగా మరికొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారన్నారు.



పంజాల రాజుగౌడ్‌కు పార్టీ కండువా కప్పుతున్న బండారు శ్రీకాంత్‌రావు

అనంతరం మాజీఎంపిటిసి పంజాల ప్రశాంతి రాజుగౌడ్ మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాల వల్ల బిజెపి పార్టీలో చేరడం జరిగిందని, సొంత గూటికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కప్పర భానుప్రకాష్‌రావు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు క్యాసారం బాబా, మామిడి కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రోజువారీ కూలీలకు టోల్‌ఫ్రీ నెంబర్ కేటాయించాలి

**గజ్వేల్, అక్టోబరు 7 (ప్రభాతవార్త):** ప్రతిరోజు గజ్వేల్ పట్టణంలో ఇందిరాపార్కు చౌరస్తావద్ద అడ్డాగా ఏర్పాటు చేసుకొని కూలీ కోసం ఎదిరిచూస్తున్నారని, అలాంటి కూలీలకు ఉపాధి అవకాశాలు సరిగా లేకపోవడం ఒక కారణమైతే వివిధ రాష్ట్రాల నుండి కూలీలు గజ్వేల్ పట్టణానికి భారీగా రావడంతో లోకల్ నాన్‌లోకల్ తగాదాలతో పని లేకుండా పోతుందనే ఉద్దేశంతో మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణను కలిసి వినతిపత్రం అందించినట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ పట్టణం దినదినాభివృద్ధి చెందుతుందని, వివిధ రాష్ట్రాల నుండి భారీగా భవన నిర్మాణ కార్మికులు, కూలీలు విపరీతంగా రావడంతో లోకల్ కూలీలకు పని దొరకడం లేదని, హైదరాబాద్ తరహాలో టిఏఎస్‌కే ఆర్గనైజేషన్ ద్వారా రోజువారి శ్రామికుల డేటా, వారి నైపుణ్యాన్ని (ప్లంబర్,ఎలక్ట్రిషన్, మేస్త్రి, లేబర్) గుర్తించి వారికి డిజిటల్ సాక్షరత నైపుణ్యాన్ని జోడించి అట్టి వివరాలను పొందుపరిచి పిపిపి (పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్షిప్) ద్వారా సెంట్రలైజ్ సిస్టం ఏర్పాటుచేసి టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా శ్రామికుల నైపుణ్యాన్ని ప్రజలు వినియోగించుకునేవిధంగా అటు మున్సిపాలిటీకి, శ్రామికులకు, ఇటు ప్రజలకు లబ్ధిచేకూరే అవకాశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. అలాగే గజ్వేల్‌లో అంత్యేష్టి ఏర్పాటుకు మున్సిపల్ అథారిటీ నుండి సహకారం అందివ్వాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ మాజీ అధ్యక్షుడు రాజారాం, మాజీ కౌన్సిలర్ చందు, షిరిడి సాయిబాబా ఆలయ నిర్వాహకులు అమరేందర్, వైశ్య నాయకులు అత్తెల్లి లక్ష్మయ్య, నేతి శ్రీనివాస్, కైలాస ప్రభాకర్, అయిత సత్యం, దొంతుల సత్యనారాయణ, బొజ్జ రవి, ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణు వర్ధన్‌రెడ్డి, సభ్యులు నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌సి.సంతోష్

## ఎమ్మెల్యేవి ఎన్నికల ఎత్తుగడ : యుగంధర్ రెడ్డి

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబరు 7 ప్రభాతవార్త :** ఫిరోజ్‌గూడా కమాన్ నిర్మాణంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిర్లక్ష్యం చేసి తాను అనుకున్న పథకం ప్రకారమే తాజాగా కమాన్ నిర్మాణం పూర్తిచేశాడని, ఇది కేవలం త్వరలో జరగబోయే కార్పొరేటర్ ఎన్నికలకు సంబంధించిన ఎత్తుగడలే తప్ప ప్రజల మీద ఆయనకు నిజమైన ప్రేమ లేదని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ నిధులు వెచ్చించి నిర్మించినట్లయితే నిధులు రావడంలో ఆలస్యం జరుగుతుం దని కానీ ఎమ్మెల్యే తన జేబులో నుండి సొంతంగా డబ్బు ఖర్చుచేసి నిర్మాణం చేపట్టడంలో ఆలస్యం ఎందుకు జరిగిం దని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే తలచుకుంటే కమాన్ నిర్మా ణం వ్యయానికి సంబంధించి సదరు నిర్మాణదారుడికి ఒకేసారి డబ్బు చెల్లించగల సత్తాఉందన్నారు. కానీ అలా చేయకుండా నిర్మాణంలో ఆలస్యం చేస్తే ప్రజలు సార్ కమాన్ నిర్మాణం ఏమైంది, జర చూడండి సార్ అని బ్రతిములాడు కునే పరిస్థితికి తీసుకెళ్లాడని తెలిపారు. స్థానిక ఫిరోజ్ గూడా నివాసితులు అందరికీ ఈ విషయం తెలుసునని అన్నారు. ఇది నిజమా కాదా, ఎమ్మెల్యే చెప్పాలి అని ప్రశ్నించారు. స్థా నిక ప్రజలు గానీ, లేక ఇంకా వేరే ఏ ప్రజలైనా సరే ఒక్క సారి ఆలోచించాలన్నారు. ఎమ్మెల్యే దగ్గర డబ్బులు లేవా? ఉన్నాయా? డబ్బులు లేకపోతే మరి ఎందుకు సొంత నిధులతో నిర్మిస్తానని మాట ఇచ్చావు,డబ్బులు ఉంటే మరి ఒకేసారి పేమెంట్ చేస్తే సరిపాయె, చకచకా పనులు పూర్తి అయి ఒక మూడు నెలల లోపలనే కమాన్ నిర్మాణం పూర్తి అయి ఉండేది, ఇప్పుడు ఏకంగా 2సంవత్సరాలు ఎందుకుపట్టిందని యుగంధర్‌రెడ్డి ప్రశ్నించారు.

## శ్రీ కార్ఖానా మైసమ్మ దేవాలయంలో పూజలు

**చార్మినార్,అక్టోబరు 7 ప్రబాతవార్త :** పురానాపూల్ గల్బ వీధిలోని శ్రీ కార్ఖానా మైసమ్మ దేవాలయంలో మంగళవారం పూజలు జరిగాయి.శ్రీకార్ఖానా మైసమ్మ దేవాలయం కమిటి అధ్యక్షులు ఎం.మహేష్ గౌడ్,కార్యవర్గ సభ్యులు పుస్తె శ్రీకాంత్,విష్ణుగౌడ్,టి.రంజిత్‌సింగ్, సందీప్‌గౌడ్, జయనాథ్,గణేష్, సూర్య, సాయి, మనీష్, నరేష్, రాహుల్‌సింగ్ అమ్మవారికి పూజలు నిర్వహించారు.

## ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి

**ఎంపి ఈటల రాజేందర్**

**శామీర్‌పేట, అక్టోబరు 7, ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు నాయిబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. మంగళవారం శామీర్‌పేట మండల కేంద్రంలోని నాయిబ్రాహ్మణుల కమిటీ హాల్ వద్ద వారి ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్‌ను నాయిబ్రాహ్మణులు అలయ్‌బలయ్ చేసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగ జరిగిన సమావేశంలో మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నాయిబ్రాహ్మణులకు 200యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చిందని ఇచ్చిన హామీని అమలు చేయమని అడిగే దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని అన్నారు. ప్రభుత్వానికి హామీల పట్ల సోయి లేకుండా పోయిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల కోసం కొట్లాడకుండ అమలు జరిగే పరిస్థితి లేకుండా పోయిందన్నారు.

ఈ విషయంపై సంబంధిత అధికారులతో తాను మాట్లాడుతానని ఎంపి ఈటల అన్నారు. నాయిబ్రాహ్మణుల కమిటీ హాల్‌కు ప్రహరీగోడ, బోర్ ఏర్పాటు చేయాలని కోరటం జరిగిందని, వాటిని ఏర్పాటు చేయటానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. కరోనా కష్టకాలంలో మీ ప్రాణాన్ని ఫణంగా పెట్టి నాయిబ్రాహ్మణులు ప్రజలకు సేవలు అందించారని, తాను కూడ ఎల్లవేళలా ప్రజలకు అండగా ఉంటానని మాట ఇస్తున్నట్లు ఎంపి ఈటల రాజేందర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు సత్యం,నాయకులు రమేశ్, గోపాల్, బాలకృష్ణ, బిక్షపతి, రాకేష్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రాంతీయ సంయుక్త సంచాలకులు

## పత్తి రైతులు మద్దతు ధరకు స్లాట్ బుకింగ్ తప్పనిసరి

**మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు మల్లేశం**

**సంగారెడ్డి మున్సిపాలిటీ అక్టోబరు 7, ప్రభాతవార్త:**

పత్తి రైతులు ప్రభు త్వం ప్రకటించిన మద్దతు ధరకు సీసీఐకి పత్తి విక్రయించాలంటే కపాస్ కిసాన్ యాప్‌లో తప్పనిసరిగా స్లాట్ బుక్ చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఈ. మల్లేశం అన్నారు.మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో కపాస్ కిసాన్ యాప్ పై వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులకు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రియాజ్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ సంయుక్త సంచాలకులు మల్లేశం మాట్లాడారు. పత్తి రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు సీసీఐకి పత్తి విక్ర యించాలంటే రైతులు ముందుగా కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని సిసిఐ కేంద్రానికి పత్తిని తీసుకెళ్లాలని సూచించారు.కేంద్ర ప్రభు త్వం ఈ సీజన్‌లో పత్తి కొనుగోళ్ల కోసం కొత్త కపాస్ కిసాన్ యాప్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాలు నాణ్యమైన పత్తికి రూ. 8110 రూపాయలు మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నూతన యాప్ పై వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కపాస్ కిసాన్ యాప్ లో వివరాల నమోదు తో సందేహాల నివృత్తి కోసం ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ 18005995779 కేటాయించినట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లాలోని వ్యవసాయ సహాయ సంచాలకులు, మార్కెట్ కమిటీ కార్యదర్శులు, సిబ్బంది, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం

**నామినేషన్ల దాఖలు, సామాగ్రి పంపిన కేంద్రాలు పరిశీలన**

**హత్నూర, అక్టోబరు 7, ప్రభాతవార్త :**

స్థానికసంస్థల ఎన్నికలకు సంబంధించి హత్నూర మండలంలో ఏర్పాట్లు వడివడిగా సాగుతున్నాయి. ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ముందు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఇందులో భాగంగానే సర్పంచ్ మరియు ఎంపీటీసీ జడ్పీటిసి ఎన్నికల సందర్భంగా నామినేషన్లు వేసేందుకు అవసమైన ఏర్పా టును అధికారులు మంగళవారం పరిశీలించారు. మండలంలో 16 ఎంపీటీసీల పరిధులను నాలుగు క్లస్టర్లుగా విభజించారు. నాలుగు ఎంపీటీసీల పరిధిని కలిపి ఒక క్లస్టర్ గా విభజించారు. రెండు క్లస్టర్లకు సంబంధించిన ఎంపీటీసీ అభ్యర్థులు ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్లు వేయాల్సి ఉండగా, మరో రెండు క్లస్టర్లకు సంబంధించి ఎంపిటిసి అభ్యర్థులు రైతు వేదికలో నామినేషన్ వేయాల్సి ఉంటుంది. జడ్పీటిసికి సంబంధించి నామినేషన్ వేయడానికి ఐకెపి కార్యాలయంలో ఏర్పాటులను చేశారు. ఎన్నికల సందర్భంగా ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేయడానికి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను హత్నూరలోని గురుకుల పాఠశాల ఆవరణను ఎంపిక చేశారు. దీనిని మంగళవారం నాడు హత్నూర తహసీల్దార్ ఫర్హీన్ షేక్, ఎంపీడీవో శంకర్, హత్నూర ఎస్సై శ్రీధర్‌రెడ్డి, హత్నూర ఎంపీ ఓ యూసుఫ్‌ల బృందం పరిశీలించింది. మండలం పరిధిలో మొత్తం 38 గ్రామపంచాయతీలు, 334 వార్డుసభ్యులు, 16 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.



ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు




## స్థానిక సంస్థల కేటగిరీల తీరుపై తీవ్ర ఆగ్రహ జ్వాల

**అన్ని పార్టీల్లోనూ అయోమయం**

**ఖంగుతింటున్న 'జనరల్' ఆశావహులు**

**బిసి,ఎస్‌సి వర్గాలలోనూ అసంతృప్తి..**

**పొంతన లేకుండా కేటాయించారని మండిపాటు**

**షాద్‌నగర్, అక్టోబరు 7, ప్రభాతవార్త :** ఎన్నికలు అంటేనే ఆశ నిరాశల ఆరాటం. టికెట్ల కోసం పోటీలోనైనా, గెలుపు బాటలోనైనా విజయం ఒక్కరినే వరిస్తుంది. షాద్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార పార్టీ ఆశావహులకు రిజర్వేషన్ల దగ్గరే గండిపడింది. ఎంతో కాలంగా ఎదురు చూపుల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఖరారైందన్న ఆనందం కంటే రిజర్వేషన్‌ల వ్యవహారం ఆశావహులకు మనశ్శాంతి లేకుండా చేసింది. దీంతో వీటి ప్రామాణికతపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

2015లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనే ఫరూక్ నగర్ జెడ్పిటిసి, ఎంపీపీ స్థానాలను ఎస్టీ మహిళలకు కేటాయించారు. ఈ క్రమంలో అప్పట్లో జెడ్పిటిసిగా అరుణ నాయక్, ఎంపీపీగా బుజ్జి నాయక్ పనిచే శారు. 2020 లో ఈ రెండు స్థానాలు జనరల్ కేటగిరిలోకి వచ్చాయి. ఈ ప్రకారం ఈ విడత బిసి కేటగిరిలోకి రావాలి, లేదా ఎసీకు కేటాయిం చాలి.. ఈ రెండు జరగకుండా ఈసారి కూడా ఎస్టీలకే కేటాయించడం పట్ల రిజర్వేషన్ నిర్ణయ ప్రక్రియపై అనుమాలు వ్యక్తమవుతున్నాయి.

ఎస్టీ కేటగిరికి సంబంధించి అధికార పార్టీలో పోటీ చేయగల సత్తా ఉన్న మహిళలు ఎవరూ కనిపించటంలేదు. ఫరూక్ నగర్ మండల పరిధిలోని కీలక గిరిజన నాయకులంతా బీఆర్ఎస్ వైపు ఉన్నారు.

ఈ నేపథ్యంలో అధికారులు ఏ లెక్క ప్రకారం ఈ రిజర్వేషన్లు నిర్ణయించారని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ జనాభా ప్రాతిపదికగా తీసుకున్నా బీసీల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అలాగే రిజర్వేషన్ల కేటగిరి ప్రకారం చూసిన బీసీలకు తాజాగా 42 శాతం కోటా ఉంది.

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జడ్పిటిసి, ఎంపీపీ స్థానాలు మొ త్తం 12 ఉన్నాయి. వీటిలో జనరల్ కేటగిరీకి మూడు స్థానాలు దక్కగా.. ఏకంగా నాలుగు స్థానాలు ఎస్టీలకే కేటాయించారు. ఇందులోను రెండిట్లో ఎస్టీ మహిళలు ఉన్నారు.

ఇక బీసీలకు కేటాయించిన ఐదు స్థానాలలో ఒకటి మహిళకు దక్కింది. మిగతా నాలుగు స్థానాలైన కొందుర్గు, కేశంపేట, చౌదరిగుడా ప్రాంతాలలో అధికార పార్టీకి ఆ స్థాయి నాయకులే కనిపించడం లేదు. పోనీ జనరల్ కేటగిరిలో బీసీలకు ఇద్దామన్న ఆ కేటగిరీలో ఇప్పటికే చాలామంది ఆశావాహులు ఉన్నారు.

ఈ నేపథ్యంలోతమకు ఎక్కడ న్యాయం జరిగిందని బీసీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. జనరల్ కేటగిరికి చెందిన నాయకుల బలం ఉన్న చోట బీసీలకు, బీసీల బలం ఉన్నచోట ఎస్టీలకు, ఎస్టీలకు ఉన్నచోట ఇంకో కరికి.. ఇలా ఏ విధంగానూ పొంతన లేకుండా రిజర్వేషన్లను నిర్ణయిం చడంతో ఆయా ప్రాంతాలలో నాయకుల నుంచి నిరసనలు వ్యక్తం అవుతు న్నాయి. ఇంతకాలం పెట్టుకున్న ఆశలన్నీ ఒక్కసారిగా బూడిదలో కలిసిపోవడంతో స్థానిక సంస్థల సమరం అయోమయంగా మారింది. మరి అధికార పార్టీ ఈ విపత్కర పరిస్థితిని ఎలా ఎదుర్కొంటుందో వేచి చూడాలి.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ దంపతులు



తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్సీ దంపతులు

**రామచంద్రాపురం, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని పట్టభద్రులు ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి మంగళవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్సీ దంపతులను టిటిడి అధికారులు సాదరంగా స్వాగతంపలికి స్వామివారి దర్శన ఏర్పాట్లుచేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపలంలో వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందచేశారు.

## ఘనంగా వాల్మీకి జయంతి



తహసీల్దార్‌కార్యాలయంలో వాల్మీకిజయంతిని జరుపుకుంటున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన నాగల్‌గిద్దలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వాల్మీకిజయంతిని ఘనంగా జరుపుకున్నారు. కార్యాలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాల్మీకి చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి నివాళులు అర్పించారు. మండల కేంద్రమైన నాగల్‌గిద్దతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకున్నారు.

## గర్భిణీ స్త్రీలు, కిశోరబాలికలకు పోషకాహారం చాలా అవసరం

-సిడిపిఓ సుజాత



పోషకాహారంపై అవగాహన కార్యక్రమం

**నారాయణఖేడ్, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
గర్భిణీస్త్రీలకు కిశోరబాలికలకు పోషకాహారం చాలా అవసరమని సిడిపిఓ ఎన్ సుజాత అన్నారు. మంగళవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ నారాయణఖేడ్ ఆధ్వర్యంలో కల్హేర్, బాచుపల్లి అంగన్‌వాడీ టీచర్ సెక్టార్‌లో పోషణమాసం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో నారాయణఖేడ్ ప్రాజెక్టు కల్హేరు సెక్టర్ సూపర్వైజర్ ప్రమీల, మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్షియల్ స్పెషలిస్ట్ పి.నర్సింహులు, అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు, పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

-సిడిపిఓ సరిత



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఓ సరిత

**జగదేవ్‌పూర్, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సిడిపిఓ సరిత పేర్కొన్నారు. మంగళవారం జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్, కుకునూర్‌పల్లి మండలం చిన్నకిష్టాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీస్త్రీలకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. అనంతరం గర్భిణీస్త్రీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్లు సునీత, సంతోష, పోషణ్ అభియాన్ సూపర్వైజర్ కిరణ్, వైద్యులు రాజశేఖర్, సత్యప్రకాష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ దరఖాస్తు గడువు పెంపు




జవహర్ నవోదయ విద్యాలయం దృశ్యం

**వర్గల్, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
జవహర్ నవోదయ విద్యాలయ, వర్గల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికిగాను 9,11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 21వ తేదీ వరకు పెంచడం జరిగిందని విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ ఒకప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యాసంవత్సరంలో 9వ తరగతిలో ప్రవేశానికి ప్రవేశపరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ప్రస్తుతం 8వ తరగతి చదువుతూ 2011 మే 1వ తేదీ నుండి 2013 జులై 31 మధ్య జన్మించి ఉండవలెనని, 11వ తరగతిలో ప్రవేశంకోరే విద్యార్థులు ప్రస్తుతం 10వ తరగతి చదువుతూ 2009 జూన్ 1వ తేదీ నుండి 2011 జులై 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. అలాగే దరఖాస్తు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రుల నివాసం ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉండాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఏదేని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలు ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ రెండు తరగతులకు ప్రవేశపరీక్ష 2026 ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ రాజేందర్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలి

-కాంగ్రెస్‌శ్రేణులకు మాజీమంత్రి పిలుపు



కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు ప్రతి కార్యకర్త తన వంతుగా కృషి చేయాలని మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డిలు సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎంపి క్యాంపు కార్యాలయంలో మండలకాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి ఆధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి, టిజిఐడిసి మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్‌లు మాట్లాడుతూ కష్టకాలంలో కాంగ్రెస్‌కు అండగా ఉంటూ పార్టీ అభ్యున్నతికి కృషిచేసిన వారే పార్టీ బి-ఫాంలు అందుకుంటారన్నారు. పార్టీ అధిష్ఠానం బి-ఫాం ఎవరికి ఇచ్చినా కాంగ్రెస్ శ్రేణులు పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన శేఖాపూర్ తండా బిఆర్ఎస్ కార్యకర్తలు...**
మండల పరిధిలోని శేఖాపూర్ తండాకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు మంగళవారం మాజీ మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మాజీ మంత్రి, చైర్మన్, నాయకులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ ముబీన్, మాజీ జడ్పిటిసి సభ్యులు నాగిశెట్టి మాణిక్యమ్మ, నాయకులు, మాజీ ఎంపిటిసి సభ్యులు హుగ్గెల్లి రాములుయాదవ్, సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, ఎంపిపి మాజీ ఉపాధ్యక్షులు రాములు, మాజీ ఎంపిటిసి సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబ్బాస్సుమ్, నాయకులు మల్లారెడ్డి, నాగిశెట్టి, నర్సింహులు, జ్యోతి జగన్మోహన్, నాగు చౌహన్, వెంకట్‌రెడ్డి, భీమయ్య, అక్బర్, జమిలాలోద్దిన్, ఖాజామియా, హర్షద్, కె.నర్సింహులు పాల్గొన్నారు.

## తెగిన కల్వర్ రోడ్డు.. స్తంభించిన రాకపోకలు..



తెగిన కల్వర్టు రోడ్డు దృశ్యం

**నిజాంపేట, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
గత రెండురోజులుగా వచ్చిన భారీవర్షాలకు చెరువు అలుగుపారటంతో కల్వర్టురోడ్డు కొట్టుకొనిపోయింది. దీంతో రాకపోకలుస్తంభించాయి. శాఖపూర్ గ్రామస్థులు మాట్లాడుతూ అత్యవసర సమయంలో కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని రోడ్డు కల్వర్టు నిర్మాణం పనులు చేపట్టాలని గతంలో కూడా ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతి చేసామని, అయినా ప్రయోజనం లేకుండాపోయిందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు రోడ్డు పనులు నిర్మించగలరని కోరుతున్నారు.

## క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా బిహెచ్ఈఎల్ ఇంటర్ యూనియన్ క్రికెట్ పోటీలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి బిహెచ్ఈఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై.శ్రీనివాస్ రావు, జనరల్ మేనేజర్ టి.నందు, డాక్టర్ సంధ్యాకర్, యూనియన్ అధ్యక్షులు ఎస్‌డివి కృష్ణంరాజు, బిఎన్ఇయుసి-ఐఎన్‌టియుసి జనరల్ సెక్రటరీ ఎస్.మహిపాల్‌రెడ్డి, సిసి వైస్ ప్రెసిడెంట్ బి.సురన్‌ప్రసాద్, సిసి జనరల్ సెక్రటరీ డి.శ్రీకాంత్, సిసి స్పోర్ట్స్ సెక్రటరీ కె.రవీందర్ తదితరులు హాజరయ్యారు. క్రీడలను క్రీడాస్ఫూర్తితో ఆడాలని అతిథులు, క్రీడాకారులకు సూచించి క్రీడాకారులకు అల్ ద బెస్ట్ చెప్పారు.

## నిరుపేదలకు వరం సిఎంఆర్ఎఫ్

-ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
నిరుపేదలకు సిఎంఆర్ఎఫ్ వరంలాంటిదని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని క్యాంపుకార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ నిధులు మంజూరైనబాధితులకు చెక్కులను పంపిణీచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ ఏమైనా అనారోగ్యాలకు గురై ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకుంటున్న పేదలకు ఈ సిఎంఆర్ఎప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈమేరకు ప్రతి ఒక్కరు సిఎంఆర్ఎఫ్ పథకంను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. ఈమేరకు నర్సాపూర్ నియోజకవర్గంలోని శివంపేట మండలానికి చెందిన దుంపాల శేఖర్‌కి మంజూరైన రూ.60,000 చెక్కును, చింతకాడి పోచమ్మకు మంజూరైన రూ.14,500 చెక్కును ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పట్టణ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు బిఆర్ఎస్‌శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమనిర్మాణాలను తొలగించిన మున్సిపల్ అధికారులు



ఆదర్శనగర్‌లో అక్రమనిర్మాణాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

**జహీరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
పట్టణంలోని జాతీయ రహదారిపై గల సిద్ధి హోటల్ నుండి ఆదర్శనగర్ గేటు వరకు గల అక్రమనిర్మాణాలను మంగళవారం మున్సిపల్ అధికారులు పోలీసుల పహారలో తొలగించారు. పట్టణంలో రెండవ అత్యంత రద్దీ ప్రాంతంగా ఉన్న ఆదర్శనగర్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపుల ఇళ్లు, వ్యాపార సముదాయాల ముందు అక్రమంగా నిర్మించుకున్న స్థలాలను, ర్యాంపులను తొలగించుకోవాలని మున్సిపల్ అధికారులు ఇళ్లవాసులకు, వ్యాపారులకు నోటీసులు జారీచేసినా పట్టించుకోకపోవడంతో మంగళవారం మున్సిపల్ కమిషనర్ డి.సుభాష్‌రావు పట్టణ సిఐ శివలింగం ఆధ్వర్యంలో పట్టణ, రూరల్ ఎస్ఐలు వినయ్‌కుమార్, ఎం.కాశీనాథ్, పోలీసుసిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో అక్రమనిర్మాణాలను తొలగించారు. రద్దీగా ఉండే ప్రాంతంలో అక్రమనిర్మాణాలను తొలగించిన మున్సిపల్ అధికారులకు పట్టణవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలపై సమావేశం



సమావేశానికి హాజరైన అధికారులు

**కంగ్టి, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించిన రిటర్నింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్స్‌తో పంచాయతీ కార్యదర్శులకు సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. మొత్తం ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలకు కంగ్టి మండలంలో 12 ఎంపిటిసి స్థానాలకుగాను 70 పోలింగ్ స్టేషన్లను గుర్తించడం జరిగింది. అన్ని పోలింగ్‌స్టేషన్లో పవర్‌సప్లై, వాటర్‌సప్లై, ర్యాంపు, టాయిలెట్ ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించడం జరిగింది. 12 ఎంపిటిసి స్థానాలకు నలుగురు రిటర్నింగ్ ఆఫీసర్స్‌ని అపాయింట్ చేయడం జరిగింది. అలాగే ఐదుమంది అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్స్‌ని అపాయింట్ చేయడం జరిగింది. వీరు 9వ తేదీ అనగా ఎల్లుండి నుండి ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలకు పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు నామినేషన్లు స్వీకరించడానికి నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేయబడినాయి. మండలపరిషత్తు కంగ్టి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించబడతాయి. జడ్పిటిసి నామినేషన్‌కు రిటర్నింగ్ ఆఫీసర్‌గా మండల ప్రత్యేక అధికారి నూతన్‌కుమార్ అపాయింట్ చేయబడినారు. వీటితో పాటే జడ్పిటిసి నామినేషన్ కూడా ఎల్లుండినుంచి స్వీకరించబడుతుంది. ఈ కౌంటర్ కూడా మండలపరిషత్ కార్యాలయంలోనే ఏర్పాటుచేయడం జరిగింది. నామినేషన్ స్వీకరించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసుకోవాలని నిర్ణయించడం జరిగింది. నామినేషన్ వేయడానికి సంబంధించిన నామినేషన్ పత్రాలు, ఓటర్ లిస్టు, ఇతర ఏర్పాట్లు అన్ని కొనసాగుతున్నాయి. ఎన్నికకు కావాల్సిన మెటీరియల్ కూడా జిల్లా పరిషత్ నుంచి సప్లై చేయడం జరిగింది. కార్యక్రమంలో జడ్పిటిసి రిటర్నింగ్ ఆఫీసర్ నూతనకుమార్, ఎంపిటిసి ఆర్వోలు నలుగురు ఏఆర్వోలు ఐదుగురు ఎంపిడివో ఎం.సత్త, ఎంపివో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

# సిజెఐపై దాడిచేసిన దుండగుడిపై కఠినచర్యలు తీసుకోవాలి

-కెవిపియస్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

**నారాయణఖేడ్, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ తన బూటు విసిరి దాడికి పాల్పడినాడని, ఈ ఘటనను కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) తీవ్రంగా ఖండిస్తుందని, కెవిపియస్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ అంబేద్కర్ భవనం దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపియస్ జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు మాట్లాడుతూ సుప్రీంకోర్టు న్యాయవాది రాకేష్ కిషోర్ సనాతన ధర్మం ముసుగులో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులోనే సిజెఐపై భౌతికదాడికి పాల్పడటం దేశచరిత్రలోనే చీకటిరోజని అత్యున్నత న్యాయస్థానాలలో కూడా మతోన్మాద మూకల దాడులు ఆగట్లేదన్నారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి అనేక కీలక తీర్పులు ఇచ్చే జస్టిస్ గవాయ్ దళితుడు కావడం వల్లే ఈ వివక్షకు ఒడిగడుతున్నారని చెప్పారు. అట్టడుగు వర్గాలు అత్యంత స్థానాల్లో ఉండటాన్ని మతోన్మాద మూకలు జీర్ణించుకోలేవని సనాతన ధర్మాన్ని వ్యతిరేకిస్తే ఎవరికైనా ఈగతి పడుతుందంటూ న్యాయవాది రాకేష్ కిషోర్ ప్రధాన న్యాయమూర్తిపై బెదిరింపులకు పాల్పడ్డాడని చెప్పారు. సనాతనధర్మం గురించి వాదించండి, చర్చించండి అని జస్టిస్ గవాయి పేర్కొన్నప్పటికీ భౌతిక దాడికి పాల్పడటం హేయమైన చర్య అని జస్టిస్ గవాయిపై దాడి కేవలం ఒక వ్యక్తి మాత్రమే చేసింది కాదన్నారు. అది ప్లాన్‌ప్రకారం మతోన్మాద ముసుగులో జరుగుతున్న భౌతిక దాడులని, తక్షణమే ఈదాడికి పాల్పడిన సుప్రీంకోర్టు న్యాయవాది రాకేష్ కిషోర్ బార్ కౌన్సిల్ సభ్యత్వం రద్దు చేయాలని అతనిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ డిమాండ్‌చేస్తుంది. ఈఘటనను దేశంలోని ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని కెవిపిఎస్ కోరుతుందన్నారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ పూలే సేవ సమితి డివిజన్ అధ్యక్షులు యస్, నర్సింలు, కెవిపియస్ జిల్లా సహాయ కార్యదర్శి యస్.గణపతి, అరుణ్, రఘు, రమేష్. శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మెడిసిన్‌లో సీటు సాధించిన అక్కాచెలెళ్లు

**సిర్గాపూర్, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చందర్‌నాయక్ తండాకు చెందిన రుక్మిణిబాయి, పుసింగ్‌నాయక్ దంపతుల ఇద్దరుకుమార్తెలు అర్చన, అమూల్యలు మెడిసిన్‌లో సీటు సాధించి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. పేద కుటుంబానికి చెందిన గిరజన విద్యార్థినులు ఎంబిబిఎస్‌లో విద్యను అందుకునేందుకు అవకాశం దక్కించుకోవడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

## ఎంపి ఆధ్వర్యంలో బిజెపిలో చేరికలు..



ఎంపి రఘునందన్‌రావు ఆధ్వర్యంలో బిజెపిలో చేరుతున్న అమూల్య, తదితరులు

**వెల్దుర్తి, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కండక్టర్ యాదగిరి కూతురు అమూల్య మెదక్ ఎంపి రఘునందన్‌రావు ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో మంగళవారం చేరారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేస్తున్న సంక్షేమ పథకాలకు అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బిజెపి పార్టీలో చేరుతున్నట్లు ఆమె ప్రకటించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ ఎంపి రఘునందన్‌రావు చేతులమీదుగా బిజెపిలో చేరారు. ఈసందర్భంగా రంగారావు చేతులమీదుగా బిజెపికి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో వెల్దుర్తి మండల బిజెపి అధ్యక్షుడు దాసు, సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## వేలాడుతున్న విద్యుత్ వైర్లు



శ్రీరామ్‌నగర్‌కాలనీలో వేలాడుతున్న విద్యుత్‌వైర్లు

**నర్సాపూర్, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపాలిటీపరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు. ఈకాలనీలో వేలాడుతున్న విద్యుత్‌వైర్లతో ఏప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈకాలనీలో 30సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్‌వైర్లు వేలాడుతూ ఒకదానికొకటి తగులుతూ మంటలు చెలరేగుతున్నాయని దీంతో విద్యుత్ వైర్లు తెగిపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అంతేగాక శ్రీరాంనగర్ కాలనీలో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో తరచు కరెంటు వచ్చి, పోతుండంవల్ల అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి అన్నారు. దీనికితోడుగా విద్యుత్‌వైర్లపై కోతులు సంచరిస్తుండటంతో కరెంటుసరఫరాకు తరచు ఆటంకం కలుగుతుందన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి శ్రీరామ్‌నగర్ కాలనీలో వేలాడుతున్న విద్యుత్‌వైర్ల స్థానంలో కొత్తవైర్లను. కండక్టర్ వైర్‌ను ఏర్పాటుచేసి కాలనీవాసులకు నిరంతరం కరెంటు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యార్థులకు రాగిజావ పంపిణీ

**సిర్గాపూర్, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని అంతర్‌గావ్ గ్రామంలోని ఎంపియుపిఎస్ పాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు శ్రీ సత్యసాయి అన్నపూర్ణ సేవ ట్రస్ట్ సహకారంతో పౌష్టికాహారం అయిన రాగి జావను మంగళవారం పంపిణి చేశారు. పాఠశాల విద్యార్థులకు రాగి జావ పంపిణి కార్యక్రమాన్ని మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ పరిశీలించారు. నల్లబెల్లం, రాగి పిండితో తయారు చేసిన రాగి జావలో ఆహారం కుదుటుగా ఉంటుందన్నారు. రాగిజావ సేవనంతో ఎనిమిక్ లోపం, పౌష్టికాహార లోపాలు లేకుండా పోతాయన్నారు. విద్యార్థులకు రాగి జావ అందించడం అనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఉపాధ్యాయులు శివకుమార్, సిఆర్‌పిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహ్మదాబాద్ పంచాయతీని ఎస్టీలకు రిజర్వ్‌చేయాలి

-మాజీ ఎంపిటిసి సంధ్యారాణి

**నర్సాపూర్, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలపరిధిలోని మహ్మదాబాద్ గ్రామపంచాయతీలో 90 శాతం గిరిజన ఓటర్లున్నారని ఈమేరకు మహ్మదాబాద్ గ్రామపంచాయతీని ఎస్టీలకు రిజర్వ్‌చేయాలని చిప్పల్‌తుర్తి మాజీ ఎంపిటిసి సంధ్యారాణి డిమాండ్‌చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహ్మదాబాద్ గ్రామపంచాయతీలో అధికంగా గిరిజనతండాలు ఉండి 90శాతం కన్నా ఎక్కువమంది గిరిజన ఓటర్లు ఉండగా స్థానిక ఎన్నికల్లో బిసిలకు రిజర్వ్ చేయడం ఏమిటని అన్నారు. ఈపంచాయతీలో ఒక శాతం నుండి రెండు శాతంకన్నా తక్కువ ఓటర్లున్న బిసిలకు ఈస్థానాన్ని కేటాయించడం సరికాదన్నారు. గత స్థానిక ఎన్నికల్లో నర్సాపూర్ మండలం జడ్పిటిసి స్థానాన్ని, ఎంపిపి స్థానాన్ని, చిప్పల్‌తుర్తి ఎంపిటిసి స్థానాలకు ఎస్టీలకు రిజర్వ్ చేయబడ్డాయని ఆమె గుర్తుచేశారు. ఈమేరకు ప్రస్తుత రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహ్మదాబాద్ గ్రామపంచాయతీని ఎస్టీలకు రిజర్వ్‌చేయాలని చిప్పల్‌తుర్తి సంధ్యారాణి ప్రభుత్వాన్ని కోరారు.

## స్విమ్మింగ్ కోచ్‌ను నియమించాలి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని స్విమ్మింగ్‌పూల్‌లో స్విమ్మింగ్ కోచ్‌ను నియమించాలని కోరుతూ మంగళవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ డిఎస్ఏ కార్యాలయంలో డివైఎస్ఓ ఖాసిం బేగ్‌కు పేరెంట్స్ వినతిపత్రం అందజేశారు. స్విమ్మింగ్‌పూల్‌లో ప్రతిరోజూ అనేకమంది విద్యార్థులు, యువకులు ఈత నేర్చుకోవడానికి వస్తుంటారని, ప్రస్తుతం శిక్షణ ఇచ్చే కోచ్ లేకపోవడంతో వారికి సరైన మార్గదర్శకత్వం అందడంలేదని పేరెంట్స్ ఆవేదన వ్యక్తంచేశారు. స్విమ్మింగ్ కోచ్‌ను నియమించి, క్రీడాకారుల భవిష్యత్తుకు ఉపయోగపడేలా వెంటనే చర్యలు తీసుకోవాలని డివైఎస్ఓ ఖాసిం బేగ్‌ను కోరారు. కార్యక్రమంలో పేరెంట్స్ మహమ్మద్ సిద్దీఖ్, మహమ్మద్ పర్వేజ్, హరిశర్మ, మసూద్, ఇంతియాజ్, అహ్మద్‌ఖాన్, అజయ్, సంతోష్, మహమ్మద్ అఫ్రోజ్ పాల్గొన్నారు.

## దుస్తులను విరాళంగా ఇద్దాం.. దీపావళిని అర్థవంతంగా చేద్దాం..

-వినూత్న కార్యక్రమానికి శ్రీకారంచుట్టిన గీతం డైరెక్టరేట్

**పటాన్‌చెరు, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
ఇవ్వడంలోనే ఆనందం ఉందని, దుస్తులను విరాళంగా ఇవ్వడం ద్వారా ఈదీపావళిని అర్థవంతంగా, స్ఫూర్తిదాయకంగా మారుద్దామని హైదరాబాదు, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ పిలుపునిచ్చింది. శ్రేయస్సుకు వార్డ్‌రోబ్ ఫర్ వెల్‌నెస్ ఇతివృత్తంగా, స్టూడెంట్ లైఫ్ డైరెక్టరేట్ విద్యార్థులను ఆహ్వానిస్తోంది. వస్త్రనోవా, చరైవేతి అనే రెండు ఉత్సాహభరితమైన విద్యార్థిక్లబ్‌ల సహకారంతో, ఈ కార్యక్రమాన్ని అక్టోబరు 7నుంచి 9వ తేదీవరకు గీతం ప్రాంగణంలోని కేఫ్ కనెక్షన్స్‌లో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సానుభూతి, సమాజసంరక్షణ, స్థిరమైన జీవనసంస్కృతిని పెంపొందించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తోంది.